

# బ్రతుకుదారి

కావేరి - సావేరి

"మిస్టర్! మె ఐనో యువర్ నేమ్ ప్లీజ్!"

ప్రభు వెనక్కి తిరిగి చూశాడు. దరిద్రానికి మారురూపం లాంటి యువకుడు, మనస్సునిండా బాధతోను, మొహంనిండా చిరునవ్వుతోనూ నిలుచున్నాడు.

"ప్రభుకుమార్!"

"థాంక్యూ మిష్టర్ ప్రభుకుమార్"

"నాతో మీకేం పని?"

"జస్ట్ ఫర్ హెల్ప్"

ప్రభు కుమార్‌కు విలుచోక తప్పలేదు. "నావల్ల ఏం సహాయంకావాలి?" అన్నాడు. "చాలాచిక్కుల్లో వున్నాను. నా చేత ఏదయినా పని చేయించుకుని ఒక్క రూపాయ యివ్వండి." చక్కని ఇంగ్లీషులో అడుగుతూవుంటే ప్రభుకుమార్ ఆశ్చర్యపోయాడు తనలాంటి వయసుగల వ్యక్తిచేత పని చేయించుకోవటమా? అందులోనూ చదువు సభ్యతగల వాని చేత, అయినా తనకుజరూరు చేయవలసిన పనులు ఏం వున్నాయ్. పాపం చాలా ఇబ్బందుల్లో వున్నట్టున్నాడులా వుంది." అని అనుకుంటూ ప్రభుకుమార్ అతనితో అన్నాడు, "చూడు బ్రదర్, మీరు చాలా చదువుకున్నవారిలా కనిపిస్తున్నారు. మీ అంతట వాడ్ని నేను. మీ చేత నేనేం పని చేయించుకోగలను? అయినా ఒకరు నాకు చేయవలసిన పనులేం లేవు. మీ పరిస్థితి నర్థం చేసుకున్నాను. ఈ రెండు రూపాయలు తీసుకోండి. అంటు రెండు రూపాయలనోటు ఇవ్వబోయాడు. అతను దాన్ని తీసికోకుండా పగలబడి నవ్వసాగాడు." భలేవారే మీరు, నేనడిగింది ఒక్కరూపాయి. మీరు ఆఫర్ చేస్తుంది రెండు రూపాయలు... పైగా చారిటబుల్‌మనీ! ... నోనో నాకు వద్దు, అన్నాడు నవ్వుతూనే.

అతం విధంగా నవ్వుతూ తనకే మాత్రం డబ్బు అవసరం లేనట్టుగామాట్లాడుతూ వుంటే ప్రభుకుమార్‌కు చాలా విచిత్రం ఆశ్చర్యం అనిపించింది. నేనింతకుముందే చెప్పాను మీరు చేయతగ్గ పనులు లేవని" అన్నాడు.

"ఒకరు చేయతగ్గవి, చేయతగనివి. అనేది వ్యక్తిగతంగా, ఎదుటివారి పరిస్థితినిబట్టి గూడా నిర్ణయించవలసిన విషయం. మీరు పోస్టాఫీసు నుండి వస్తున్నట్టుగా ఉంది. చేతిలో కవర్లు కనిపిస్తున్నాయిగా. మీకభ్యంతరం లేకపోతే ఆ ఉత్తరాలు నే వ్రాసి పెడతాను" అన్నాడు.

అతని కోర్కెకు ప్రభువుకు నవ్వు వచ్చింది. "ఏమిటీ? ఉత్తరాలు వ్రాస్తారా? చాలా చిత్రంగా మాట్లాడుతున్నారే మీరు?" అన్నాడు.

ఇందులో మీరు ఆశ్చర్య పడాల్సిన పనేం లేదు. మనదేశంలో లేదుగాని విదేశాలలో కొన్ని వేలమంది. పోస్టాఫీసు దగ్గర ఉత్తరాలు వ్రాస్తూ బ్రతికేవారున్నారు. మీకభ్యంతరం లేకపోతే వ్రాసిపెడతాను. మీపని చేసినవాడినౌతాను. నాకు మీరు సహాయం చేసిన వారౌతారు. సంశయించకండి. కనీసం నా డిగ్రీ ఇందుకైనా ఉపయోగపడనివ్వండి."

"ఆల్ రైట్. మా రూంకు రండి వెడదాము."

ప్రభును అతను అనుసరించాడు. ఇద్దరూ రూంకు చేరుకున్నారు.

"మీ పేరు?" అతనికొక కుర్చీ చూపిస్తూ అడిగాడు ప్రభు.

"సారీ నా పేరు రంగారావు"

"నా పేరు ప్రభుకుమార్, చెప్పానుగదూ! ఇక్కడ బి. యస్సీ. ఫైనల్ మొన్ననే వ్రాశాను. మాదిఅసలు ఖండపాక లెండి. మా నాన్నగార్కి రాజమండ్రిలో పెద్ద బిజనెస్సు ఉంది."

"వెరీ గుడ్! ఇంతకీ ఉత్తరం ఎవరికి వ్రాయమంటారు? ఫాదర్‌కు డబ్బు పంపించమని వ్రాయమంటారా?"

"అవసరంలేదు, మనీ మొన్ననే వచ్చింది"

"మరి?"

గర్ల్ ఫ్రెండుకు వ్రాయాలి."

"ఈజిట్ ష్యూర్!"

"అవును"

"అయితే టీనేజ్ ఫ్రెండ్సులో పడ్డారన్నమాట. గుడ్! అయితే ఈ వైట్ పేపర్ వద్దు. రోజ్ కలర్ పేపరు లేదూ? వాటిమీద వ్రాసిన ప్రేమలేఖలన్నీ సఫలితాన్నిస్తాయని చరిత్ర చెపుతూంది." అంటూ నవ్వాడు రంగారావు.

"ఉంది" అంటూ గులాబి రంగు లెటర్‌పాడ్ యిచ్చాడు ప్రభు.

దాన్ని రంగారావు అందుకుంటూ "చూడు బ్రదర్ ఈ లవ్ అనేది చూశావూ! అది టీనేజర్సుకు వుండాల్సిందే. అదిఏయిర్ కండిషన్ రూంలాంటిది. అందులో పడ్డవానికి చలికాలంలో వెచ్చని ఊహలు వేసవిలో చల్లని తలపులు ఇస్తూంటుంది. నిజమే నంటారా!" నవ్వుతూ అన్నాడు.

ప్రభు అతనితోపాటు తనూ నవ్వేశాడు.

"చెప్పండి. ఏం వ్రాయమంటారో!" పెన్ను

తెరుస్తూ అన్నారు రంగారావు.

"ఏం వ్రాసినా ప్రయోజనం కనపట్టంలేద."

మీరు చాలా నిస్పృహచెందుతున్నారు. ఇలాంటి విషయాల్లో చాలా ఓపిక ఉండాలి. నేను మీకుమల్లే ఒకమ్మాయిని ప్రేమించాను. నా కాలేజీ లైఫ్‌లో సంవత్సరం ఓపిక పట్టాల్సి వచ్చింది. చివరిక తల్లి దండ్రుల్ని ఎదిరించి పెళ్లాడేనసుకోంది. కాబట్టికొంత ఓపిక ఉండాలి."

"ఎన్నాళ్ళని ఓపిక పట్టమంటారు. పరిచయం అయి ఆరునెలు అయింది. డజను ఉత్తరాలు వ్రాస్తే అరడజను సమాధానాలు వచ్చాయి. పైగా అందులో ఏవో కొంటిసాకులు".

"ఆల్‌రైట్. ఈ ఉత్తరంతో ఆమె మీ కాళ్ల దగ్గర వ్రాలేలా వ్రాస్తాను. ఏమంటారు?"

"కానివ్వండి. కానీ ఒక్క విషయం. మిమ్మల్ని చూచిన తరువాత మీమీద జాలి, అభిమానం కలిగిన మాట యదార్థమే. అందుక్కారణం. మీ నిష్కల్మషమైన మనస్సే. కాని యిప్పుడు నా ఆప్త మిత్రునిగా భావించి నా అంతరంగిక విషయాలు కూడచెపుతున్నాను. ఇవన్నీ మీమనస్సులో మాత్రమే ఉండాలి"

"బ్రదర్! మీరునన్ను తన ఆప్తమిత్రునిగా భావించి నందుకు చాలా సంతోషిస్తున్నాను. అటువంటి మిత్రునికి ద్రోహం చేసేంతటి నీచుణ్ణికాను

"మీరటువంటివారుకారని నాకుతెలుసు. మనస్సులోని వూహలను కాగితం మీద పెట్టేప్పుడు ఎంత ఇబ్బంది ఉందో ఇతరులతో చెప్పేటప్పుడు అంతకు రెట్టింపు ఇబ్బంది వుందని యిప్పుడు తెల్సింది."

'ఆ యిబ్బంది మీరేం పడనవసరం లేదు. ఆ అమ్మాయి పేరు చెప్పండి. నేను వ్రాస్తాను."

"పద్మ"

"పద్మా ?"

"అవును. ఏం ఆపేరు బాగా లేదా మీకు?"

"ఆపేరంటే నాకసహ్యం. ఆపేరుగలఅమ్మాయిలన్నా అసహ్యం...భయం...కోపం."

"ఏం? ఎందుకని?"

"మా ఆవిడపేరుకూడా పద్మే! దానికి పూటకో టిఫిను. రోజుకో చీర. వారానికో నగ, నెలకో ఐర్త్‌డే కావాలంటుంది. అవన్నీ తీర్చటం నాతరమా? అందుకే పద్మఅనే వాళ్ళంటేనే నాకు అసహ్యం... కోపం... ఏమిటేమిటో వాగేస్తున్నాను, మరేం అనుకోకండి...మరోవిషయం... మీకు బాగా ఆస్తి వుందిగదూ!"

"ఉంది?"

"ఆహా! మరేంలేదు. ఆస్తివుంటేనే ప్రేమించమని నాఉద్దేశం కాదు. కానీ కొంతయినా ఉండాలంటాను. ఎందుకంటే పెళ్ళయిన తరువాత ఆమె కనీసపు కోర్కెలు తీర్చటానికయినా కొంతఆస్తి వుండాలంటాను. ఎందుకు చెపుతున్నానంటే ఇది నా స్వంత అనుభవం. మీరుకూడా నా ఆత్మీయుల్లా భావిస్తున్నారు కాబట్టి. నా అంతరంగిక విషయాలు చెపుతున్నాను. మాపద్మ నన్ను మొదట నిష్కల్మషంగానే ప్రేమించింది. నేను ఏమీఆస్తిలేని వాడినని కూడ తెలుసు. కానీ పెళ్ళయిన తరువాత మాత్రం ఆమె కోర్కెల పక్షులకు రెక్కలు వచ్చాయి.

వాటినిపట్టి పంజరంలో బంధించటం నాకు చేతకావటంలేదు. నిజం చెప్పాలంటే మీ రివ్వబోయే రూపాయిలో అర్ధరూపాయి మల్లె పూలు, అర్ధరూపాయి నెయిల్ పాలిషు తీసుకెళ్ళాలి. ఇది మా ఆవిడకు ప్రతిదినం తీర్చవలసిన కనీసపు కోర్కె. అది తీర్చలేనినాడు నన్ను పనికిరాని వానిగా చేసేస్తుంది....అదిగో నన్ను చూచి మీరు జాలిపడుతున్నారు. కానీ ఏం చేయను చెప్పండి. బి. ఏ. ప్యాసయినా ఉద్యోగం దొరకటం లేదు. ఈ బాధలన్నీ మా ఆవిడకు పట్టవు. తిండికి లేక

పోయినా షోకులకు తక్కువచేయదు. క్షమించండి మిమ్మల్ని బోరు కొట్టేస్తున్నానులా ఉంది." అని నవ్వేశాడు.

రంగారావు మాటలు వింటుంటే ప్రభువుకు చాలా జాలికలిగింది. కానీ అతనేం చేయగలడు-రంగారావు ఉత్తరం వ్రాయటం ప్రారంభించాడు.

"మై డియర్ స్వీట్ పద్మా! నీవు నా ఉత్తరం కోసం యెదురు చూస్తూవుంటావని తెలుసు. కానీ ఏం లాభం. నే నెన్ని ఉత్తరాలు వ్రాసినా నీవు వ్రాసే సమాధానం ఒక్కటే. నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో, నీకూ తెలుసు. నీవు నన్నెంతగా ప్రేమిస్తున్నావో నాకూ తెలుసు. కానీమనప్రేమ కేవలం కాగితాలద్వారానే తెలుపుకోవలసిందికాదు. మన ఇరువురి హృదయాలు ఒక్కసారి కలుసుకొని మాట్లాడుకోవాలి. మనప్రేమను వ్యక్తం చేసుకోవాలి. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నాను. కానీ భగవంతుడు మన ప్రేమను పరీక్షిస్తున్నాడు. ఎందువల్లనంటే. నిన్ననే నేను ఒకకారు ప్రమాతంలో గాయపడ్డాను, కాళ్ళకు, చేతులకు దెబ్బలు తగిలాయి. హాస్పిటల్లో కట్టుకట్టించుకుని వచ్చాను. మన అదృష్టం బాగుంటంవల్ల పెద్ద ప్రమాదం ఏమీ లేదు. నిన్నటినుండి ఒక్కసారి నిన్నుచూడాలని ఉంది. నీ వెచ్చని ఒడిలో తలదాచుకుంటే నాబాధ నంతటినీ మర్చిపోతాను. గోరుచుట్టుపై రోకటి పోటులా మానాన్న వచ్చాడిక్కడికి ఈ యాక్సిడెంట్ విషయం తెలిసి. నన్ను తీసుకు వెళ్ళిపోతానంటున్నాడు. కానీ నిన్ను విడిచి నేనెక్కడికి వెళతాను. మా నాన్నకు మనవిషయం అంతా చెప్పాను. ఏమూడులో ఉన్నాడోగానీ వెంటనేఅంగీకరించారు. రేపు సాయంకాలం మాప్రయాణం. చేతులకు కట్లు ఉంటంవల్ల మిత్రునిచేత యీ ఉత్తరం వ్రాయిస్తున్నాను. నన్ను నీవు నిజంగా ప్రేమిస్తే వెంటనేరా! నీకోసం ఎదురు చూస్తూఉంటాను. నీ..."

రంగారావు ఉత్తరం వ్రాయటం పూర్తిచేసి, "ప్రభుగారూ! చివరసంతకం మాత్రం మీరు పెట్టండి. మరొక విషయం, మీ మీదున్న చనువు కొద్దీ ఇందులో కారు ప్రమాదం అని ఒక చిన్న అబద్ధం వ్రాశాను. అదీ మీ కోసమే. వెయ్యి అబద్ధాలు ఆడి ఒక పెళ్ళిచెయ్యాలన్నారు. పనికి రాని అబద్ధాలు వెయ్యికాదు. పదివేలయినా శుద్ధ దండగ! అందుకే పని జరగటానికి బాంబులాంటి అబద్ధం ఒక్కటేవ్రాశాను. ఏమంటారు? చదివి ఎలా ఉందోచెప్పండి." అంటూ తనువ్రాసిన ఉత్తరం ఇచ్చాడు.

ప్రభుకుమార్ దాన్ని పూర్తిగా చదివి చిరునవ్వు నవ్వుతూ "మీలో చాలా భావుకత ఉంది." అన్నాడు సంతకం చేయటానికి పెన్నుతీసుకుంటూ.

అతనిలో కలసి నవ్వుతూ "మీకు తెలీదు. నేను కాలేజీలో చదువుతున్నప్పుడు మా పద్మకు ఇలాగే ఉత్తరం వ్రాసాము. ఆ దెబ్బతో ఆ సాయంకాలమే నా దగ్గరకు వచ్చేసింది. అది చూచి మా ఫ్రెండ్సంతా తమకు ప్రేమ లేఖలు వ్రాసి పెట్టమని ప్రాణం తీసేశారు. మీరు నమ్మినట్టు కనబట్టంలేదు. నిజమండి" అన్నాడు రంగారావు. అతన్ని నమ్మేలా చేయటానికి ప్రయత్నిస్తూ.

# మనీషి

—పి. లలిత

కన్నీరొలికే కన్నులను చూడకుండా
కరకుగా కదలిపోతుంది కాలం
అవును దానికేం అది జడం
కానీ మనసుండి మనిషైన నీవు
ఏం చూస్తున్నావు? ఏం చేస్తున్నావు?
ఆ పేదవాని కన్నీటి కన్నులలో
నీ బూట్‌పాలీష్ నిగనిగలు
వానిపాత చొక్కా చిరుగులు
నీ అందాల భవిష్యత్తుకు
అతికే చక్కని వెంటిలేటర్లు
తిరిగితిరిగి అరిగిపోయి
పగుళ్ళుజూపిన వాడికాళ్లు
నెలకొక్కటిచొప్పున మార్చే
నీ కొత్త కాడిలాక్ పైర్లు
కష్టంచేసినవాని శ్రమజలం
నీ రిఫ్రిజిరేటర్‌లో కూల్‌వాటర్!
ఇంకా తలయెత్తుకునే ఉన్నావా?
అవును నీ సోదరుడిని దోచి
కులికే నీకు ఆత్మఉందనుకుని
చెప్పబూనటం నా అవివేకం
కానీ ఒక్కటిమాత్రం గుర్తుంచుకో!
పువ్వుని అన్యాయంగా చిదుమ
చూసే ముల్లై గుచ్చుకుంటుంది
గదిలో మూసినపిల్లి నీపై
తిరగబడి రక్తం కళ్ళచూస్తుంది!
ఇంకా వాని సహనాన్ని పరీక్షించకు
వానిని వేరుచేసి చూడకు
వాడు నీ త్రాతప్రాణదాత
మనసిచ్చి మన్నించి గౌరవించు
అప్పుడు నీవునిజంగా మనిషివి
అప్పుడు నీవు నిజంగా మనీషివి

ప్రభుకుమార్ పెన్నుమూస్తూ "మీరు చాలా విచిత్రమైన వ్యక్తిలా కన్పిస్తున్నారు. ఉత్తరాలు వ్రాయటం ఒక వృత్తిగా పెట్టుకున్నవారు నాకు తెలిసినంతవరకు మీరే కనిపిస్తున్నారు." అన్నాడు.

"నాకిది వృత్తికాదు."

"వదిపుంది మీ అవసరంకోసం వ్రాయిస్తే అప్పుడు మీకిది వృత్తికాక ఏమవుతుంది?"

"నిజమే లెండి. బ్రతకటానికి ఏదో ఒహటి ఉండాలిగదా!"

ప్రభుకుమార్ ఫ్లాస్కుతీసిరెండుకప్పుల్లో టీపోసి ఒకటి అతనికిచ్చాడు. అది పూర్తిగా తాగి కప్పు క్రిందపెట్టి "నేవెళ్తానండి" అన్నాడు రంగారావు.

ప్రభు అతనికి ఐదు రూపాయల నోటుయిస్తూ "చాల థాంక్సండి!" అన్నాడు.

"అరెరె! అంతపెద్ద నోటుయిస్తే ఎలా?" రంగారావు ఆశ్చర్యపోతూ అన్నాడు.

"ఉంచండి ఫరవాలేదు. చాలాపెద్ద ఉత్తరం వ్రాశారుగదా!" అన్నాడు నవ్వుతూ.

"అయితే నేనే మీకు థాంక్స్ చెప్పాలి. మెనీ మెనీ థాంక్సు" అంటూ దాన్ని తీసుకున్నాడు. "ఫరవాలేదు. బహూశా నేను ఒక వారం రోజుల్లోపోతాను. మీరు వ్రాసిన ఉత్తరం ఫలిస్తే మీకు నేనెంతో ఋణపడి వుంటాను. అయినారేపు సాయంకాలం ఒకసారి ఇక్కడకు రండి. మీ ఉత్తరం ఎంతవరకు పనిచేసిందో మీరే చూదురుగాని" అన్నాడు.

తప్పకుండా వస్తాను. మరి శెలవు!" అంటూ లేచాడు రంగారావు. ప్రభు అతన్ని సాగనంపి అతను వెళ్ళినవైపే చూస్తూ "పాపం, పేదవాడు" అనుకున్నాడు.

* * * *

బజార్లో రామ్మూర్తికనుపించగానే రంగారావుకు ప్రాణం లేచివచ్చింది.

"ఒరేయ్. రామ్మూర్తీ" అని పిలుస్తున్నా ఏమాత్రం వినిపించనట్టుగా వెళ్ళిపోతున్న రామ్మూర్తిని పరుగు నడక మీద వెళ్ళి చేయి పట్టుకొని ఆపాడు.

"ఏం రా? ఎంత పిలిచినా పలక్కుండా పోతున్నావు?" అన్నాడు నిష్టూరంగా. రామ్మూర్తి మొహం చిటచిటలాడిస్తూ "అర్జెంటు పనిమీద వెళుతున్నాను గానీ, ఏమిటి విషయం?" అన్నాడు. అతను తనను ఆపినందుకు లోలోపల తిట్టుకుంటూ.

"ఏం లేదురా! ఒక్క అర్ధరూపాయింటే సర్దరా. చాలా అత్యవసరం" అన్నాడు.

తను అనుకున్నదే అవటంవల్ల రామ్మూర్తికి ఒళ్ళుమండిపోయింది. "ఎందుకురా? పెళ్ళానికి పువ్వులు కొంటానికా?" అన్నాడు.

అతనేం మాటాడక పోవటంతో రామ్మూర్తి విజృంభించాడు. సిగ్గులేదట్రా! పెళ్ళాంకి పువ్వులు కొంటానికి అర్ధరూపాయి. అప్పు అడగటానికి వచ్చావా! ఆ మాత్రం పువ్వులు కొనలేనివాడివి పెళ్ళెందుకు చేసుకున్నావురా? దానికితోడు లౌమారేజి... నీబ్రతుక్కి అదొకటి! హాయిగ మీవాన్న చూసిన సంబంధం చేసుకుంటే కోరిన కట్నంవచ్చి యీబాధలన్నీ తప్పేవిగదరా! ప్రేమించి చేసుకున్నావు కాబట్టి అది నీ నెత్తి మీద కెక్కి కూచుంది. అసలు పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని వాడికి పెళ్ళెందుకురా? సిగ్గులేకపోతేసరి! ఏం మొహం పెట్టుకుని వచ్చావురా అప్పుకు. ఇంతకు ముందుబాకీయిచ్చిందిలేదుగానీ మళ్ళీవచ్చాడు. నిన్ను చూసి ఆ మహాతల్లి రాణీగారిలా జల్సా చేస్తుంది మింగటానికి ముందు మెతుకులు వెతుక్కోవాలిరా. ఆ తరవాతే ఏమైనా. చేతనయితే పెళ్ళాన్ని అదుపులో పెట్టుకో. అప్పుడు నీకీ బాధలు తప్పుతాయి." రామ్మూర్తి అంటూ వెళ్ళిపోయాడు. గబగబ. అతని మాటలతో రంగారావు బిక్కచచ్చిపోయాడు. తలకొట్టేసినంత పనయింది. వెధవ! డబ్బు లివ్వకపోతే పోయింది. ఏం మాటనేశాడు! పువ్వులకని ఎలా అగ్రహించేశాడో అయినా వాడన్న మాటల్లో తప్పేంవుంది? నిజమే! పెళ్ళాన్ని అదుపులో పెట్టలేక పోతున్నాను, దాని దగ్గర చాలాహీనంగా బ్రతుకుతున్నాను. మగవాడినన్న విషయం దానికి ఒక్కసారి గుర్తుండదు. నిజంగా దానికోసం తను ఎందుకింత దిగజారి పోయాడు! ఛీ...ఛీ! ఇంక యీ బ్రతుకు తను బ్రతక గూడదు. దాని ఆటలు సాగనీ కూడదు. రంగారావు వెనుదిరిగాడు గిరుక్కున. కోపంతో పెదాలు అదురుతున్నాయి. ఆవేశంతో నరాలన్నీ బిగుసుకు పోయాయి. నెత్తురు వేడెక్కి పరుగు లెత్త సాగింది. ఎదురుగా వస్తున్న లారీలను, కార్లను తప్పుకుంటూ గబగబ నడవ సాగాడు. ఎదురుగా పూలదుకాణం కనిపించేసరికి అతని కాళ్ళు ఆగిపోయాయి. మెర్క్యూరీ బల్బు కాంతిలో మల్లెపూలు తెల్లగా మెరుస్తున్నాయి, చల్లని పూల మెత్తని వాసనలు అతన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. వెంటనే రామమూర్తి గుర్తుకు వచ్చాడు. వెంటనే బయలు దేరాడు. ఇంటికి.

ఇంటికి చేరేసరికి లోపల చిక్కని చీకటి పేరుకుంది. లైటు వెలిగించనందుకు పద్మమీద కోపం రెండింతలు పెరిగింది. "పద్మా! లైటు వెలిగించటానికి కూడా తీరికలేదా?" అని అరుస్తూ స్విచ్చి వేశాడు. ఆ ఎర్రని వెలుగులో టేబిలుమీద గాజుగ్లాసు క్రింద ఒక కాగితం కదిలింది అతని కేకకు, దాన్ని తీసుకుని చదవ సాగాడు రంగారావు.

శ్రీవారికి- మీరు వచ్చేసరికి నే వెళ్ళిపోతున్నాను, మీతో చెప్పకుండా. అందుకు నన్ను క్షమించమని అడగనుకూడా! నేనెందుకు వెళ్ళిపోతున్నానో మీకు బాగా తెలిసి ఉంటుంది. భగవంతుడు ప్రతివారిని సుఖంగా బ్రతకమని చెప్పాడు కానీ, అందుకు తగిన అవకాశాలు మాత్రం కొందరికే ఇచ్చాడు. అటువంటివారు ఆ అవకాశాలను వెతుక్కోవటంలో నాకేమాత్రం తప్పు కనిపించటంలేదు. అందుకనే వెళ్ళిపోతున్నాను. "ఎక్కడకి?" అనే ప్రశ్న మీకు కలిగితే దానికి సమాధానం మీకు దొరికివుండదు. ఎందువల్లనంటే మీరు నన్ను మొదటినుండి గాఢంగా ప్రేమిస్తూనే వున్నారు. నాక్కావలసింది ప్రేమకాదు. సౌఖ్యం. ప్రేమలో సుఖముందంటే అది నేను నమ్మను. అది మన కడుపులను నింపుతుందంటే అంతకన్నా హాస్యాస్పదం మరొకటిలేదు. ప్రేమకు అర్థంలేదని మిమ్మల్ని పెళ్ళిచేసుకున్న తరువాత తెలిసింది. ఈ విషయంలో నేను అంతకన్నా ఏం చెప్పలేను. నన్ను వెదికే ప్రయత్నం మాత్రం చేయవద్దు.

పద్మ"

రంగారావు దాన్ని వణుకుతున్న చేతులతో దాన్ని మడిచి. టేబిల్‌మీదున్న మరో కాగితాన్ని అందులో దస్తూరిని చూసి నిర్ఘాంతపోయాడు. అది తను ప్రభుకుమార్‌కు వ్రాసిపెట్టిన ఉత్తరం!

★

